రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి ఉషాశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రైతుసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి ఉషాశ్రీచరణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో మైక్రోవాటర్ షెడ్ నందు వ్యవసాయ ఉత్పాదక పెంపుదల ద్వారా మంజూరైన వ్యవసాయపనిముట్లు, తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీల స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టాలను అందజేశారు. ఈ పథకం క్రింద 198 మంది రైతులు ఎంపిక కాగా 587 మంది రైతులకు ఈ పనిముట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారులు, వైసిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం...

ధర అమాంతం పెరిగిపోవటంతో చికెన్‌ను కొనలేం.. తినలేం అన్న పరిస్థితి ఏర్పడింది. వేసవికాలం కావడంతో చికెన్ ధరలు కొండెక్కాయి. దాదాపు 25 రోజుల నుంచి చికెన్ ధరలు పైపైకి పోతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు చికెన్ తినడానికి జంకుతున్నాయి. మటన్ ధరలు ధరలు ఆకాశాన్నంటడంతో ఎక్కువమంది మాంసం ప్రియులు చికెన్ తినడానికే ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో చికెన్ ధరలు కూడా అమాంతం పెరగడంతో మాంసాహారం వండుకుని తినడానికి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు వెనకడుగు వేస్తున్నాయి.

కొండెక్కిన చికెన్ ధర..!
వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెల

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండల వ్యాప్తంగా కిలో చికెన్ స్కిన్‌తో రూ.260, స్కిన్‌లెస్ రూ.280 ధర పలుకుతోంది. ఎండల వేడికి కోళ్లు చనిపోతుండడంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో చికెన్ ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మూడు నెలల నుంచి కిలో చికెన్ రూ.100 నుంచి రూ.140 వరకూ పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఒక్కసారిగా కిలో చికెన్ రూ.260 పలకడంతో కొనడానికి మాంసం ప్రియులు జంకుతున్నారు. సాధరణంగా మార్కెట్లో ఒక్కో చికెన్ దుకాణంలో రోజుకు 100 నుంచి 150 కిలోలు అమ్మకాలు జరిగేవి. ధర పెరగడంతో 30 నుంచి 50 కిలోలు మాత్రమే అమ్ముడుపోతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మధ్యాహ్నం నుంచి కిలో చికెన్ రూ.20 తగ్గించినా కొనుగోలుదారులు ముందుకు రావడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. రాష్ట్రంలో కోళ్ల ఫారాలు ఎక్కువ సంఖ్యలో ఉన్నా వేసవిలో ఎండ తీవ్రతకు బ్రాయిలర్ కోళ్లు తట్టుకోలేక మృత్యువాత పడుతుండడంతో ఫారాల సంఖ్య తగ్గుతోంది. కర్నాటక రాష్ట్రంలో కాస్త ఎండ తీవ్రత తక్కువగా ఉండడంతో బ్రాయిలర్ కోళ్ల పెంపకం ఎక్కువగా ఉంటుంది. దేవనహళ్లి, బళ్లారి వంటి ప్రాంతాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపారులు తెలిపారు. గతంతో పోలిస్తే కోళ్లకు వేసే దాణా ధరలు పెరిగాయి. సోయా, మొక్కజొన్న, సజ్జలను మిశ్రమం చేసి దాణాగా తయారు చేసి కోళ్లకు అందిస్తారు. ప్రస్తుతం 50 కిలో బస్తా రూ.2500 ఉండగా, గతే ఏడాది రూ.1800 ఉండేది. దాణా ధర పెరగడంతో పాటు వేసవిలో కోళ్ల డిమాండ్ తగ్గ సప్లయ్ లేకపోవడంతో చికెన్ ధరలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

చికెన్ కొనలేకపోతున్నాం..

ఒక్కసారిగా ధరలు పెరగడంతో చికెన్ కొనలేకపోతున్నాం. చికెన్‌కి బదులు పప్పన్నంతోనే సర్దుకుపోతున్నాం. రోజూ పనికి పోతే రూ.250 నుండి రూ.300 వరకూ కూలి ఇస్తున్నారు. రోజంతా పని చేస్తే చికెన్‌కే సరిపోయే పరిస్థితి తలెత్తింది. మిగిలిన సరుకులు ఎలా కొనాలో అర్థం కాక చికెన్ కొనడమే బంద్ చేశాం.

బాషా,
ఆత్మకూరు

వ్యాపారం లేక నష్టపోతున్నాం..

ఎండ వేడిమికి కోళ్ల ఉత్పత్తి తగ్గింది. దీంతో చికెన్ ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మార్కెట్లో లైవ్ కోడి ధర రూ.230పైనే ఉంది. ఇలాంటి సమయంలో ధరలు పెరగడం మామూలే. ధరలు పెరగడంతో చికెన్ కొనేందుకు జనాలు రావడం లేదు. మధ్యాహ్నం కిలోపై రూ.20 తగ్గించినా ఎవరు కొనడం లేదు. ఫలితంగా రోజూ వ్యాపారంలో నష్టపోతున్నాం.

ఆనంద్,
చికెన్ వ్యాపారి

మెకానిక్ కుమారుడికి జెఇఇలో 248 ర్యాంకు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రంలో మోటార్ మెకానిక్‌గా పని చేస్తున్న షేక్షావలి కుమారుడు కె.సర్దార్‌వలి జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో 248వ ర్యాంకు సాధించాడు. షేక్షావలి సిపిఎం అనంబంధ సంఘం ఆవాజ్ మండల నాయకుడిగా పనిచేస్తున్నాడు. అంతేగాకుండా మోటార్ మెకానిక్ పని చేస్తూ కుమారుడు సర్దార్‌వలిని కష్టపడి చదివిస్తున్నాడు. దీంతో సోమవారం మండల కేంద్రంలోని షేక్షావలి నివాసంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ ర్యాంకు సాధించిన విద్యార్థితోపాటు తండ్రీని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ షేక్షావలి కష్టపడి పని చేస్తూనే ఆవాజ్ సంఘంలో ఉంటూ ముస్లిములకు సేవ చేస్తున్నాడన్నారు. షేక్షావలి ఎంతో నిబద్ధత కలిగిన నాయకుడిగా పని చేస్తున్నాడన్నారు. అలాంటి మెకానిక్ కొడుకు జెఇఇలో మంచి ర్యాంకు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ విద్యార్థి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

విద్యార్థికి స్వీట్ తినిపిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్

రక్తదానంపై అపోహలు వీడాలి : ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజలు రక్తదానంపై అపోహలు వీడాలని కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని రెవెన్యూ భవన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి జ్ఞాపికలు అందజేయడంతోపాటు సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ రక్తదానంపై అపోహలు వీడి అర్హులైన వారు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రవాణా శాఖ, రెవెన్యూ, జడ్పీ పోలీస్ తదితర శాఖల అధికారులు రక్తదాన శిబిరాల ఏర్పాటుకు రెడ్‌క్రాస్ సొసైటీకి తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ లక్ష్మణప్రసాద్, రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ హరిణీరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మనోరంజన్‌రెడ్డి, సుధీర్, జిల్లా రెవెన్యూ అధికారిణి గాయత్రీదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - రాయదుర్గం

వివిధ రూపాల్లో పెంచిన విద్యుత్‌ఛార్జీలను వెంటనే తగ్గించాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయదుర్గంలోని ఎపి ఎన్‌జిఒ భవన్‌లో సిపిఐ పట్టణ కార్యదర్శి కోట్రెష్ అధ్యక్షతన సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ, సిపిఐ ఎంఎల్, ఎమ్మార్పీఎస్, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, సిఐటియు, ఎఐటియుసి, ఎపి రైతు సంఘం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు, ట్రూ అఫ్ చార్జీల పేరుతో ప్రజలపై జగన్ ప్రభుత్వం గుదిబండ మోపుతోందన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు అవినాష్ రెడ్డికి, ఆదానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. రాష్ట్రంలో నాలుగేళ్ల పాలనలో ఏడుసార్లు కరెంటు బిల్లులు పెంచిన ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అని అన్నారు. అదేవిధంగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లంటూ కొత్త విధానాన్ని తీసుకొచ్చి ఒక కోటి 89 లక్షల మందికి వినియోగదారుల పైన రూ. 3500 కోట్ల భారాన్ని వేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం, ఒక్కో మీటర్‌పై 37 వేల రూపాయలు వసూలు చేస్తోందన్నారు. ఈ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ రాజస్థాన్, చండీఘడ్‌లో ఒక్కొక్క దానికి 7900 రూపాయలుఉంటే, ఇక్కడ మాత్రం జగన్ ఒక్కో మీటర్ పైన 37 వేల రూపాయలు వసూలు చేస్తోందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో అమలుపరచిన ఈ స్మార్ట్ మీటర్లను వినియోగదారులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. అలాంటి స్మార్ట్ మీటర్లు ఆంధ్రలో అమలుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టి వ్యవసాయ పంపుసెట్లకి మీటర్లు బిగించేందుకు పూర్తి ప్రయత్నాలు చేస్తున్నప్పటికి బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా ఇప్పటివరకు వ్యవసాయ పంపుసెట్లకు మోటర్లు బిగించడానికి అంగీకరించడం లేదన్నారు. ఆయా రాష్ట్రాలలో ప్రజా వ్యతిరేకత పూర్తిగా ఉందనానరు. అయితే నరేంద్ర నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన జగన్మోహన్ రెడ్డి వ్యవసాయ పొలాలకు పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు ముందుకు వచ్చి అమలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తన తీరును మార్చుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం తాలూకా కార్యదర్శి మల్లికార్జున, సిపిఐ తాలూకా ప్రధాన కార్యదర్శి నాగార్జున, టీడీపీ పట్టణ అధ్యక్షులు పసుపులేటి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు అనీల్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బంగి శివ, ఎఐ ఎస్ ఎఫ్ తాలూకా అధ్యక్షులు అంజి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ తాలూకా అధ్యక్షులు ఆంజనేయులు, దొమ్మరి సంఘం ప్రతినిధి రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ ప్రతినిధి గోవిందు, ఎంఎంజెఎస్ ప్రతినిధి మద్దానప్ప, సిపిఎం నాయకులు నాగరాజు, మధు, టీడీపీ అధ్యక్షులు పి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు జయన్న, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వక్తలు

స్పందన వినతులపై నిర్లక్ష్యం తగదు : కలెక్టర్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రెవిన్యూ శాఖకు సంబంధించి ప్రజలలో సంతృప్తికర స్థాయి పెరిగేలా జగనన్నకు చెబుదాం అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. గౌతమి జిల్లా అధికారులను, తహశీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లను ఆదేశించారు. అలాగే స్పందనలో వచ్చే వినతుల పై కూడ నిర్లక్ష్యం తగదని సూచించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో స్పందన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహశీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లతో రెవిన్యూ శాఖకు సంబంధించి వచ్చిన జగనన్నకు చెపుదాం అర్జీల పరిష్కారంపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవలు తదితర అంశాలలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలకు నిర్ణీత కాలవ్యవధిలోగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లరాదన్నారు. రీఓపెన్ అయిన అర్జీలను సంబంధిత డివిజన్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి తగిన విధంగా ఎండార్స్‌మెంట్ చేయాలన్నారు. అర్జీలకు ఎండార్స్‌మెంట్ చేసే నివేదికలో తీసుకున్న చర్యలు వాస్తవ పరిస్థితులు స్పష్టంగా అర్జీదారునికి అర్థమయ్యే విధంగా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెన్ అర్జీలపై ఆయా తహశీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లతో చర్చించి కారణాలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు తగిన సూచనలు జారీ చేశారు. అలాగే స్పందన – జగనన్నకు చెబుదాంలలో వచ్చే అర్జీలను క్షుణ్ణంగా ఆయా శాఖ అధికారులు పరిశీలించి ప్రతి ఫిర్యాదును ప్రభుత్వ నిబంధనలకు లోబడి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం 1902 సంబంధించి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టేందుకు అవసరమైన ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఈనెల 23న ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో జగనన్న సురక్ష మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకం అందించడమే లక్ష్యంగా ఆయా శాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. దీనికోసం ఈనెల 24 నుండి 30 వరకు ముందస్తుగా క్షేత్రస్థాయిలో సిబ్బంది వాలంటీర్ల చేత డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సచివాలయ పరిధిలో సచివాలయ సిబ్బంది, వాలంటర్లు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశం గురించి వివరించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం నుండి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉందో తెలుసుకోవాలన్నారు. క్యాంపుల నిర్వహణలో భాగంగా తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొన్ని మండలాలకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సచివాలయాల పనితీరు, నాడు నేడు పనులు, హౌసింగ్, గోరుముద్ద పథకం అమలు, హాస్టళ్ల తనఖీ, ఉపాధి హామీ పనులు, ఖరీఫ్‌కు సంబంధించి విత్తన నాణ్యత, పంపిణీ, క్రాప్ ఇన్సూరెన్స్ , గడపగడపకు మన ప్రభుత్వం పనులు బిల్లుల అప్లోడింగ్ తదితర వాటిపై పర్యవేక్షించి ఏవైనా లోటుపాట్లు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ , డిఆర్ఒ గాయత్రీ దేవి, ఆర్డీవో మధుసూదన్, జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, హౌసింగ్ పీడీ కేశవ్ నాయుడు , డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్

కరోనా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పుర పాలక సంఘంలో కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులుగా సేవలందించిన వారిని అవుట్ సోర్సింగ్ కింద తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు ఔట్‌సోర్సింగ్ కార్మికులతోపాటు కరోనా సమయంలో పని చేసిన కార్మికులు సోమవారం పట్టణంలోని ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఇదివరకూ కరోనా మహమ్మారి వ్యాపించినప్పుడు మొదటి రెండవ దశలో 16 మంది కార్మికులు అవుట్ సోర్సింగ్ పద్ధతిన పురపాలక సంఘంలో పనిచేశారన్నారు. అంతేకాక గతేడాది కురిసిన భారీ వర్షాల వల్ల పట్టణంలో పల్లపు ప్రాంతాలు జలమయం కాగా ఔట్‌సోర్సింగ్ కార్మికులు తాత్కాలిక పద్ధతిన విధులు నిర్వర్తించారన్నారు. కావున తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవుట్‌సోర్సింగ్ కార్మికులు పుత్ర రాజు, తిప్పేస్వామి, వన్నూరుస్వామి, రామాంజనప్ప, రేణుక, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

సంపూర్ణ పోషణయాప్‌లో

కొత్తవర్షన్‌ను రద్దు చేయాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

అంగన్వాడీలను అవమానించే రీతిలో తీసుకొచ్చిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ యాప్‌లోని 1.2.9 కొత్త వర్షన్‌ను వెంటనే రద్దు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్, శకుంతల, రమాదేవి, జమున సోమవారం ఒక ప్రక టనలో డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సెంటర్ పరి ధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల నమోదు ను మొదటి నుంచి కూడా అంగన్వాడీ వర్కరే నమో దు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం కొత్తగా అంగన్వాడీ వర్కర్లను అవమానించే విధంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ యాప్‌లో 1.2.9 కొత్త వర్షన్‌ను తీసుకొచ్చారన్నారు. కొత్త వర్షన్ ద్వారా ఎఎన్ఎంలు గర్భిణుల నమోదు, బాలింతల నమోదు, డెలివరీ వివరాలను ఎఎన్ఎం ద్వారా నమోదు చేసిన తర్వాత సచివాలయానికి, సచివాలయాల నుంచి మహిళా పోలీస్, అక్కడ నుండి అంగన్వాడీ టీచర్‌కు ఆ లిస్టులను మహిళా పోలీసుల ద్వారా పంపుతామని చెప్పటం దుర్మార్గమన్నారు. వెయ్యి జనాభా పరిధిలో ఓ అంగన్వాడీ వర్కర్ అందుబాటులో ఉంటుందన్నారు. ఆమె గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు సేవలు చేస్తోందన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులకు అందుబాటులో ఉన్న అంగన్వాడీ వర్కర్‌ను తొలగించి ఎఎన్ఎంలు, ఎంఎస్‌కెల ద్వారా రిజిస్ట్రేషన్ చేయమని చెప్పటం అవమానకరమన్నారు. దీనివల్ల అంగన్‌వాడీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. వెంటనే వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ యాప్‌లో తీసుకొచ్చిన నూతన వర్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ సోమవారం పరిశీలించారు. శిక్షణ విధుల్లో భాగంగా నాలుగైదు రోజుల నుంచి మండలంలో ఎంపిడిఒ విధులు నిర్వహిస్తూ వివిధ కార్యాలయాలు, పాఠశాలలు సందర్శిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పండ్ల తోటల పెంపకం ఎలా జరుగుతోంది.. మొక్కలు ఎక్కడి నుంచి తెస్తున్నారు. వాటి సంరక్షణకు రైతులకు ఏ విధంగా.. ఎప్పుడెప్పుడు ఎన్ని నిధులు వస్తున్నాయనే వివరాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, ఎపిఒలు ఓబన్న, లక్ష్మీకాంతాబాయ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

చెక్‌డ్యాం పనులు పూర్తి చేయాలి

ఆత్మకూరు : మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన చెక్‌డ్యాం నాణ్యతను జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌డ్యాం పనులను త్వరగా పూర్తి చేసి నీటి నిల్వ ఉంచాలన్నారు. నీటిని నిల్వ చేస్తే రైతుల బోరు బావుల్లో నీరు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుజాత, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌డ్యాం పనులను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పేదలపై కక్షగట్టిన ప్రభుత్వం

టిడ్కో ఇళ్ల వద్ద 'కాలవ' సెల్ఫీ వీడియో

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న సకంకల్పంతో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రారంభించిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను ఆపేసిన వైసిపి ప్రభుత్వం పేదలపై కక్షగట్టిందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా సోమవారం రాయదుర్గం శివార్లలోని మల్లాపురం లే అవుట్‌లో బహుళ అంతస్తుల ఇళ్ల నిర్మాణాల వద్ద సెల్ఫీ తీసుకుని వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ఆవాసం కల్పించాలన్న ఉద్దేశంతో టిడ్కో ద్వారా దాదాపు రూ.104 కోట్లతో అప్పటి టీడీపీ ప్రభుత్వం బహుళ అంతస్తుల నిర్మాణాలను చేపట్టిందన్నారు. పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి 1800 ఇళ్లను కేటాయించామన్నారు. రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామన్నారు. రెండోసారి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే రెండేళ్ల కిందటే గృహ ప్రవేశాలు జరిగి ప్రజలతో ఈ ప్రాంతమంతా కళకళలాడుతుండేదన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నాలుగేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండటం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ కళ్లు తెరిచి టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంతోపాటు అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సెల్ఫీ వీడియో తీసుకుంటున్న కాలవ శ్రీనివాసులు

పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు పూర్తి చేయండి

అనంతపురం కార్పొరేషన్ : ఎస్ఎస్ ట్యాంకు వద్ద మెయిన్ పైప్‌లైన్ లీకేజీ కావడంతో చేపట్టిన మరమ్మతు పనులను మేయర్ మహమ్మద్ వసీం సోమవారం పరిశీలించారు. అలాగే నగరంలోని అంబేద్కర్ నగర్‌లో రూ.29 లక్షలతో 15వ ఆర్థిక నిధులతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ సిఎం జగన్ సహకారంతో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వీటితోపాటు రూ.25 కోట్లు స్పెషల్ గ్రాంట్ విడుదలైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చంద్రకళ, అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, డిఇ చంద్రశేఖర, అసిస్టెంట్ ఇంజినీర్ బాబావలి, సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి వార్తకు స్పందన

మసీదు చుట్టూ పేరుకుపోయిన మురుగు తొలగింపు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని జామియా మసీదు (పెద్ద మసీదు) చుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలతోపాటు వెళ్లే దారిలో ఉన్న మురుగు నీటిని అధికారులు సోమవారం తొలగించారు. మురుగు కాలువకు వ్యర్థాలు అడ్డుపడి మురికి నీరు రోడ్డుపైకి వస్తుండటంతో 'మసీదులోకి వెళ్లాలంటే మురుగు దాటాల్సిందే..' అంటూ సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు కలిసి మసీదు చుట్టూ పేరుకుపోయిన మరుగునీటిని పంచాయతీ కార్మికులతో పరిశుభ్రం చేయించారు. త్వరలో మసీదు సమీపంలో డ్రెయినేజీ కాలువ కల్వర్టులను ఎత్తి చేసి పగిలిన పైప్‌లైన్లను మరమ్మతులు చేసి మసీదు ముందు మురుగునీరు రాకుండా చూస్తామని ఎంపిడిఒ దివాకర్ తెలిపారు. దీంతో స్థానికులతోపాటు ముస్లిములు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

ఆర్డీటీ వ్యవస్థాపకులు 'ఫాదర్'కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా పేదల పెన్నిధి ఫాదర్ ఫెర్రర్ అని పోతుల లక్ష్మీనరసింహులు కొనియాడారు. ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం అనంతపురం 10వ డివిజన్ ఫెర్రర్ కాలనీలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించే రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి)ని స్థాపించి జిల్లాలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లింగమయ్య, సమాజ సేవకులు నేసే ఆంజనేయులు, టిడిపి నాయకులు కుంచపు వడ్డే వెంకటేష్, దూదేకుల బాబా ఫక్రుద్దీన్, మున్వర్, సీనియర్ నాయకులు బాబా ఫక్రుద్దీన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు శ్రీనివాసులు, మంజునాథ్, కాజా, దుర్గ, పెద్దన్న, మహిళలు పోతుల రాజేశ్వరి, భావన, మీనా, వసంత, మున్ని, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శింగనమల : జిల్లాలో ఫాదర్‌ఫెర్రర్ చేసిన సేవలు మరువలేనివని తహశీల్దార్ ఈశ్వరమ్మ కొనియాడారు. ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఎనలేని సేవ చేసిన మహానుభావుడు ఫాదర్‌ఫెరార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా టీమ్‌లీడర్ సుధాకర్, మండల పరిధిలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్ర మం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడం తోపాటు ప్రభుత్వం పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందున్నారు. పార్టీలకతీతంగా ప్రతీ పథకం అర్హులందరికీ అందజేస్తున్నామన్నారు. అనంతరం మహిళలతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, నాయకులు త్రిలోక్‌నాథ్‌రెడ్డి, రామాంజనేయులు, మండల కన్వీనర్ శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, నరిగన్న, హనుమంతురాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, రుద్రానంద, అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సర్పంచి భాగ్యమ్మ సూచించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని నెలగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు అశ్విని, శ్రావణి, సరస్వతీకి అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ సిఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా సోషల్ మీడియా కన్వీనర్ జయరామిరెడ్డి, వై.శ్రీనివాసులు, ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SHAIK BEE BI (Old Name)** W/o SHAIK IBRAHIM residing at 1-87, 1st Cross, 1st Road, Anantapuram-515004, Anantapur Dist. AP. Changing my name from **SHAIK BEE BI to SHAIK BIBI (New Name).** Hence for, I am being called as SHAIK BIBI for all purposes.

మహారాజశ్రీ గుత్తి ఆరవ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టులో
గార్డియన్ O.P.No.33/2023

(మైనర్ అయిన పి.లక్ష్మీదీపికకు స్థిరాస్తిలో భాగమును అమ్ముటకు అనుమతి కోసం మైనరు యొక్క తాతగారు పాదర్తి గోపాల్‌రావు దాఖలు చేసిన కేసు నందు)

Between:
పాదర్తి గోపాల్ రావు S/o పి.ఆంజనేయులు, ఇంటి నెం.2-47, దేవగుదూరు-523274, జారుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా.
...పిటీషనర్
మరియు
నిల్ ...రెస్పాండెంట్స్

ప్రకటన

పై కేసు నందు పిటీషనర్ తన మైనరు మనవరాలు అయిన పి.లక్ష్మీదీపిక తండ్రి లేట్ పాదర్తి వెంకటేశ్వర్లు, హిందువు, వయస్సు:15 సం॥లు, డోర్‌నెం. 17-950-బి, తిలక్‌నగర్, గుంతకల్లు నకు షెడ్యూలు దాఖలా స్థిరాస్తిలో 14/36వ భాగమును సదరు మైనరు వుపయోగము కొరకు మరియు బాగు కోసం అమ్ముటకు అనుమతి ఇవ్వవలసినదిగా కోరుతూ పై కేసును దాఖలు చేసియున్నారు. పైకేసు 07-07-2023వ తేదీకి వాయిదా వేయబడినది. పై విషయంలో కోర్టువారు అనుమతి ఇచ్చుటకు ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు వున్న యెడల పై కోర్టు నందు పై వాయిదా తేదీన ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకొనవచ్చును. లేనియెడల పై కేసును కోర్టువారు చట్టపరముగా తీర్మానము చేయుదురు.

షెడ్యూలు:

అనంతపురం జిల్లా రిజిస్ట్రేషన్, గుంతకల్లు సబ్ రిజిస్ట్రేషన్ సర్వే నెంబరు 162 తిమ్మనచెర్ల గ్రామ పొలములో, గుంతకల్లు మండలం, గుత్తి రోడ్డు ఏరియా, గుంతకల్లు మునిసిపాలిటీ పరిధిలో వార్డునెం.17, డోర్‌నెం.17/211, అసెస్మెంట్ నెం.1003004030 గల ఇల్లు వుండి శిథిలమై నందు వల్ల తొలగించబడి ప్రస్తుతము బయలు స్థలముగా గల స్థిరాస్తి వివరాలు.
హద్దులు: తూర్పు:పి.వేణుగోపాల్ ఇల్లు, పడమర:రామిరెడ్డి ఇల్లు, ఉత్తరం:గుత్తిరోడ్డు, దక్షిణం:వాసవీ థియేటర్. కొలతలు:తూర్పు-పడమర:18 అడుగులు లేక 5.48 మీటర్లు, ఉత్తర-దక్షిణం:57 అడుగులు లేక 17.37 మీ॥ వెరసి: 114 చ॥అ॥
(కోర్టువారి ఆదేశాల మేరకు)

జి.లక్ష్మీపతి, ఎన్.గాదిలింగప్ప
పిటీషనర్స్ తరపు వకీలు, గుంతకల్లు.

కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి

ప్రజాశక్తి-ఉరవకొండ

కుష్టు వ్యాధి రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని రాకెట్ల ప్రభుత్వ వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకూ ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన గృహాలను సందర్శించి కుష్టు వ్యాధి గ్రస్థులను గుర్తించాలన్నారు. స్పర్శ లేని మచ్చలు, ముఖం, కనుబొమ్మలు, ఎద, వీపుపై నొప్పిలేని బుడిపేలు, కనురెప్పలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవుట, ముక్కుదూలం ఆగిపోయి గాలి ఆడకపోవడం, బొటనవేలు, చిటికెనవేలు, మణికట్టు పనిచేయపోవడం లాంటివి కుష్టు లక్షణాలన్నారు. ఇలాంటి లక్షణాలు ఉంటే గుర్తించి ఆసుపత్రికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండి షఫీ, సూపర్‌వైజర్ శేఖర్, సీఓ భగవాన్‌దాస్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాకెట్ల ప్రభుత్వ వైద్యాధికారి వెంకటేష్‌నాయక్

పోటీతత్వంతో పెరగనున్న ప్రతిభ

'ఆణిముత్యాలు'లో విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యార్థుల చదువు విషయంలో పోటీతత్వం పెంచుకోవడం ద్వారా ప్రతిభ కూడా పెరుగుతుందని విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ఎపి మోడల్ స్కూల్ ఆవరణలో మండల విద్యాశాఖ అధికారిణి నాగమణి అధ్యక్షతన నియోజకవర్గం స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గతేడాది పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఓట్ల రాజకీయం చేయడం లేదన్నారు. ముఖ్యంగా విద్యార్థుల విషయంలో అత్యంత పకడ్బందీగా పని చేస్తున్నారన్నారు. అందుకోసమే విద్యార్థుల కోసం అనేక పథకాలను తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, మాజీ అధ్యక్షులు ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు ఇప్పటి మాదిరి అనేక సౌకర్యాలు ప్రోత్సాహకాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎంపిడిఒ కొండయ్య, ఎంఇఒ-2 వెంకటరమేష్, ఎంపిపి భవానీ, జడ్పిటిసి మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్‌బాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్, మురళి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా 2022 - 23 సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం విడపనకల్ మండల పరిధిలోని గడేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మనోహర్‌రావు, ఉపాధ్యాయులు పద్మభవానీ, సాయికుమారి, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, మేకల పంపాపతి, ఉప సర్పంచి రాము, మాజీ ఉపసర్పంచి లింగన్న, పెద్ద వన్నురుస్వామి, కేశవులు, ఉమాశంకర్, స్కూల్ కమిటీ ఛైర్మన్ రాముడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

గుత్తి : ప్రతి విద్యార్థినీ ఉన్నత విద్యను అభ్యసించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూర్‌బీ, ఎంపిపి జి.విశాలాక్షి, మండల విద్యాధికారి బి.రవినాయక్ సూచించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పట్టణంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ప్రిన్సిపల్ ఎం.రుద్రాక్షి అధ్యక్షతన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జి.శిరీష, పి. వైష్ణవి, తోపాటు మరో విద్యార్థినికి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బి.రామేశ్వర్ రెడ్డి, వెంకటరాముడు, చిన్న వెంకట రాముడు, ఎస్.మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : చదువులో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఎంపీపీ శ్రీదేవి, మండల విద్యాధికారి రాముడు పిలుపునిచ్చారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దవడుగూరు కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు రూరల్ : పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ కొండాపురం రోడ్డు సర్వే నెంబర్-1 ప్రభుత్వ భూమిలో 80 మందికిపైగా పేదలకు గుడిసెలు వేసుకునే జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ఈనెల 7న పోలీసులు, రెవెన్యూ అధికారులు జెసిబిలతో గుడిసెలు కూల్చివేసే లక్షల ఆస్తి నష్టం కలిగించారన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా అక్కడే నివాసం ఏర్పాటు చేసుకోమని చెప్పారన్నారు. అయితే స్థానిక పోలీసులు మాత్రం రోజూ గుడిసెల వద్దకు వెళ్లి ఖాళీ చేస్తారా.. జైల్లో పెట్టాలా.. అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే అలాంటి పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ గుంతకల్ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్, పట్టణ కార్యదర్శి చిన్నా, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, పెద్దన్న, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు బాషా, వెంకటేష్, రంగనాయకులు, తిరుపాల్, నాగముని, కాలనీవాసులు పాల్గొన్నారు.

20న ఉచిత గుండె వైద్యశిబిరం

శింగనమల : అనంతపురం సవీరా ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని గుమ్మేపల్లిలో సర్పంచి దేగల లలితమ్మ, టిడిపి ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండె, చాతీ నొప్పి, గుండె దడ, ఆయాసం, కళ్లు తిరగడం, గుండె మంట, చాతీలో బరువు ఉండడం. నిద్రలో లేచి కూర్చోవడం, కాళ్లు వాయడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

'పశుబీమా'పై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలో పశు వైద్యశాలలో పశుబీమా పథకంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యల్లనూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఖదీర్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన సవరణలతో పశుబీమా పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. బీమా కట్టిన వారికి దేశవాళీ పశువులకు రూ.15వేలు, సంకర జాతి పశువులకు రూ.30వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఇందుకు దేశవాళీ పశువులకు రూ.200, సంకర జాతి పశువులకు రూ.400 ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే గొర్రెలు, మేకలకు రూ.36 ప్రీమియం చెల్లిస్తే బీమా కంపెనీలు రూ.6వేలు ఒక్కో గొర్రె, మేకకు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డివిజినల్ అధికారి రమేష్‌రెడ్డి, పుట్లూరు పశుసంవర్ధక శాఖ అధికారి నాగ సువర్ణ, పశువైద్య సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్, బాల్య వివాహాలపై అవగాహన

ఉరవకొండ : ఉరవకొండలోని సెంట్రల్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్‌లో సోమవారం బీసీ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ర్యాగింగ్, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాకే నరేష్, పట్టణ సీఐ హరినాథ్, బిసి విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కె.మధు మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేయడం ద్వారా అనేక నష్టాలతోపాటు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అలాగే చదువుకునే సమయంలో పాఠశాలలో ర్యాగింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ స్కూల్ హెచ్‌ఎం అనీఫ్, గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం అనితాకుమారి, బీసీ విద్యార్థి సంఘం నాయకులు ప్రవీణ్, అరవింద్, వంశీకృష్ణ, భరత్, విజయ్, యశ్వంత, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే 100కు సమాచారమివ్వాలి

ప్రజాశక్తి-నార్పల

కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సిఐ అన్సర్‌బాషా సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాలలో మహిళా పోలీసులతో కలిసి సోమవారం విద్యార్థులకు ర్యాగింగ్‌తోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా ర్యాగింగ్‌గానీ, ఈవ్‌టీజింగ్‌కుగానీ పాల్పడితే చర్యలు తప్పవన్నారు. విద్యార్థినులు కళాశాల నుంచి వచ్చేటప్పుడుగానీ, వెళ్లేటప్పుడుగానీ వేధింపులకు గురి చేయొద్దన్నారు. ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే వెంటనే డయల్ 100కుగానీ, దిశా ఎస్ఓఎస్‌కుగానీ సమాచారం అందించాలన్నారు. అనంతరం దిశా యాప్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలప్ప, అధ్యాపకులు కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తన స్వగృహంలో పలువురు బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఉరవకొండ మండలం బూదగవి గ్రామానికి చెందిన బసవనగౌడ్‌కు రూ.26వేలు, విడపనకల్ మండల కేంద్రానికి చెందిన బోయ శీనాకు రూ.1.30లక్షలు, కనేకల్ మండలం గెనిగెరకి చెందిన నెట్టికల్లప్ప గారి కిరణ్‌కుమార్‌రెడ్డికి రూ.1లక్ష మంజూరైంది. వీరందరూ అనారోగ్య బారిన పడి వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నారు. కావున ప్రభుత్వం ఆదుకోవాలని సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో రూ.2,54,000 మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రమణారెడ్డి, కరకముక్కల ఎంపిటిసి మల్లికార్జున, రాముడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శివరామిరెడ్డి

ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ జనసంఘం నియోజకవర్గ అధ్యక్షులు స్వర్ణసాగర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్సీ జన సంఘం స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉరవకొండలోని ఎంఆర్‌సి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తూ ఉరవకొండలోని ప్రయివేట్ కళాశాలలు, పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే విద్యార్థులకు పుస్తకాలు అధిక రేట్లకు అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జెఎస్ఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు హరీష్, సుధాకర్, కమిటీ సభ్యులు యశ్వంత్, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పుట్లూరు : మండలంలోని సంజీవపురానికి చెందిన మోటాటి కొండారెడ్డి, భార్య లక్ష్మమ్మ జ్ఞాపకార్థం కుమారుడు చిన్న వెంగళరెడ్డి, కోడలు విజయ గౌరమ్మ కుటుంబ సభ్యులు కలిసి శివకృష్ణ సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు.

విద్యాకానుక పంపిణీ

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రయివేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడమే సీఎం జగన్ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే వైవిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో 'జగనన్న విద్యాకానుక' కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద, వసతి దీవెన, విద్యాదీవెన పథకాలు అందజేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, త్రిలోకనాథ్‌రెడ్డి, రామాంజనేయులు, కన్వీనర్ శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు సోమవారం విద్యాకానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే సిఎం జగన్ విద్యార్థులకు ఓ మేనమామలా విద్యాకానుక పంపించారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, మండల విద్యాధికారి కృష్ణయ్య, ఉప మండలాధ్యక్షురాలు వెంకటలక్ష్మి, సర్పంచి సుప్రియ, ఉప సర్పంచి శ్రీరాములు, విద్యాకమిటీ ఛైర్మన్ శ్రీధర్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విష ప్రయోగంతో 195 నాటుకోళ్లు మృతి

గుత్తి : మండలంలోని బేతాపల్లి గ్రామంలో సోమవారం విష ప్రయోగంతో 195 నాటుకోళ్లు మృతి చెందాయి. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఉదయాన్నే మేతకు వెళ్లిన నాటుకోళ్లు ఉన్నఫలంగా ఒక్కొక్కటి కుప్పకూలి కిందపడి మృతిచెందాయి. ఇటీవల గ్రామానికి చెందిన ఓ మహిళ తన నాటుకోడి మరణించిందనే నెపంతో తిండి గింజల్లో విషం పెట్టడం వల్ల నాటుకోళ్లన్నీ మృతి చెందాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా రూ.లక్ష నష్టం వాటిల్లిందన్నారు. ఆ మహిళపై గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్ఐ రామకృష్ణారెడ్డి గ్రామానికి చేరుకుని ఆ మహిళలను అదుపులోకి తీసుకుని విచారించారు. కోళ్లు చనిపోవడానికి తనకు సంబంధం లేదని మహిళ చెప్పినట్లు తెలుస్తోంది

మృతిచెందిన కోళ్లు

ఇసుకట్రాక్టర్ పట్టివేత

తాడిపత్రి రూరల్ : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఆలూరు గ్రామానికి చెందిన రంగనాథ్ తన ట్రాక్టర్‌లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నాలుగు టన్నుల ఇసుకను తరలిస్తుండగా సజ్జలదిన్నె గ్రామం వద్ద దాడి చేసి సీజ్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

మోటార్ సైకిల్, కారు ఢీ..

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని రావివెంకటాంపల్లి గ్రామం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మోటార్ సైకిల్‌పై వెళ్తున్న తాడిపత్రికి చెందిన హాజరత్, కృష్ణారెడ్డిని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 ద్వారా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

టవర్‌క్లాక్ బ్రిడ్జ్‌కి 'రాయల' పేరు పెట్టాలి

అనంతపురం : నగరంలోని టవర్‌క్లాక్ బ్రిడ్జికి శ్రీకృష్ణదేవరాయల పేరు పెట్టాలని రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షులు పాముదాయి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీఅనంత వెంకటరామిరెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాముదాయి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 525 సంవత్సరాల క్రితం కృష్ణదేవరాయ వారసులైన బుక్కరాయలు చక్రవర్తి పరిపాలించిన కాలంలో రెండవ భార్య అనంతమ్మ పేరుమీద అనంతపురం నగరం ఏర్పడిందన్నారు. అలాంటి నగరంలో నూతనంగా నిర్మించిన టవర్‌క్లాక్ బ్రిడ్జికి శ్రీకృష్ణదేవరాయల పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బలిజ సంఘం కార్యవర్గ సభ్యులు, రాయలసీమ బలిజ మహాసంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన 2వ ఎంఇఒలు

నార్పల : మండల రెండో విద్యాధిశాఖాధికారిగా నారపరెడ్డి సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గార్లదిన్నె మండలం మర్తాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన ఈయన పదోన్నతి రావడంతో నార్పల 2వ ఎంఇఒగా నార్పలకు వచ్చారు. ఇందులో భాగంగా 1వ ఎంఇఒ కృష్ణయ్యతో కలిసి ఎంపిడిఒ దివాకర్, ఎంపిపి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరి సహకారంతో మండలంలో విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు ఆయనతోపాటు ప్రభుత్వ బాలుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పెద్దవడుగూరు మండల విద్యాధికారి-2గా గురుప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నార్పల మండలం గూడూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న గురుప్రసాద్ పదోన్నతిపై పెద్దవడుగూరుకు వచ్చారు. ఈసందర్భంగా పెద్దవడుగూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు, ఎపిటిఎఫ్ నాయకులు అభినందించారు.

బూదగవిలో భూసార పరీక్షలు

ఉరవకొండ : మండల పరిధిలోని బుదగవి గ్రామంలో రైతు నాగరాజు పొలంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ ఆధ్వర్యంలో సోమవారం భూసార పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు భూసార పరీక్షల వల్ల లాభాలు, ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు భరోసా శాఖ సిబ్బంది, గ్రామ వ్యవసాయ, హార్టికల్చర్ అసిస్టెంట్లు షఫీ, చిక్కన్న, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

ఆత్మకూరు : గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ప్రత్యేక చొరవ చూపి కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ విజయేంద్రప్రసాద్, ఎంపిపి సుబ్బర హేమలత సూచించారు. సోమవారం మండల పరిధిలోని పడమటి యాలేరు, ఆత్మకూరు గ్రామాల్లో చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పడమటి యాలేరు దళిత కాలనీలో ఉన్న శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని ఎంపీపీ హేమలతకు, వైస్ ఎంపిపి నీలిమారెడ్డికి గ్రామ దళితులు, పెద్దలు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుజాత, నాయకులు ఫణిరెడ్డి, దళిత కాలనీ నాయకులు నాగభూషణం, ఎర్రిస్వామి, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

ద్వారంపూడి.. తస్మాత్ జాగ్రత్త.. : జనసేన

అనంతపురం : కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డీ.. తస్మాత్ జాగ్రత్త.. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌పై అనవసర విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పవన్‌కళ్యాన్ తన వారాహి వాహనంపై వీరవిహారం చేస్తూ కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి లెక్కలు తేల్చగానే కరెంట్ షాక్ తగిలిన కాకిలాగా విలువిల్లాడిపోతున్నాడన్నారు. పవన్ చెప్పినట్టుగా మీ దౌర్జన్యాలు ఇక సాగబోవన్నారు. మరొకసారి స్థాయికి మించి మాట్లాడితే ఎమ్మెల్యే ద్వారంపూడికి కాకినాడ ప్రజలు జనసైనికులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

చేనేతల సమస్యలను పరిష్కరించాలి

అనంతపురం : చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పామిశెట్టి గోవింద్ డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ పూర్తిగా విఫలమైందన్నారు. దీంతో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్తితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చేనేతల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు